# స్వేచ్ఛాయజ్ఞం

ఆకలి, నిద్రలాగే సెక్సుకూడా ఒక ఇన్‌స్టింక్ట్. ప్రకృతే అనండి, దేవుడే అనండి, ఎవరైనాగాని ఆడదానికి చేసిన అన్యాయం సెక్సుకీ, మాతృత్వానికీ ముడిపెట్టడం. దానితో సెక్సు పేరు చెప్తే ఆడది భయపడే స్థితి కలుగుతోంది. ఆడ దాన్ని మాతృదేవత అన్నారు. కాని ఆ మాతృత్వానికి మొగుడనే ఒక లైసెన్సు వుండాలి. లేని పక్షంలో అది ఒక శాపంలా అయిపోతుంది.

ఒకప్పుడు - వేదకాలంలో - ఆడదాని ఏకైక ధ్యేయం పిల్లల్ని - అందులోనూ మగపిల్లల్ని కనటమే. ఎంచేతోగాని అప్పటివాళ్ళు ఇహాంకంటే పరానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేరు. ఎంతసేపూ పరలోకంలో నాకు సద్గతి వుంటుందా స్వర్గంలో సీటు దొరుకుతుందా అన్న బాధే కాని, యిప్పుడు మనం ఎలా బతకాలి అన్న ఆలోచనే లేదు. తండ్రి, తాతలకి స్వర్గలోక ప్రాప్తి కలగాలంటే కొడుకు శ్రాద్ధ కర్మలు చెయ్యాలి. కూతురు పనికిరాదు. మరంచేత ప్రతి మనిషికి కొడుకు అవసరం. కొడుకునైనా, కూతురైనా మగవాడు

కనలేదు. అప్పుడింక కొడుకుని కనడానికి ఆడది అవసరం. మరి ఆడవాళ్ళకి మాత్రం స్వర్గలోక ప్రాప్తులు అక్కర్లేదా అని నాలాటి వాళ్ళకి సందేహం రావచ్చు. మొగుడికి మనసాను పరిత్రమై, అతనికి కొడుకుల్ని కనివ్వడం ద్వారానే ఆవిడకి పుణ్యం వస్తుంది.

అప్పటివాళ్ళు స్వర్గలోకంకోసం ఎంత తహ తహలాడి, కేవలం కొడుకోసం ఎంత లిబరల్‌గా వున్నారంటే-ఒకవేళ ఏ కారణం చేతనైనా కొడుకు పుట్టకుండానే మొగుడు హరీమంటే మరింక ఆ మొగుడి గతేం కాను? అనవసరంగా నరకానికి పోతాడే! అంచేత ఆ మొగుడు పోయిన తర్వాత ఆ భార్య ఒక ఆర్నెల్లు మాత్రం అతి నిష్ఠతో పూజా, పునస్కారాలు, పుణ్యకార్యాలు చేస్తూ, ఆర్నెల్లవగానే తన గురువుల అనుమతిగాని, లేక మావఁగారి అనుమతిగాని తీసుకొని భర్త అన్నదమ్ముల్లో ఒకరికి-వీలైనంతవరకు పెద్దవాడికి - కొడుకుని కనాలి. ఆ కొడుకు యిటు మాజీ మొగుడికీ, అటు ప్రస్తుత మొగుడికీ వారసుడు. వాడివల్ల ఇద్దరికీ స్వర్గం గారంటీ. అవకాశం దొరికింది కదా అని ఆవిడ అతనితో జీవితం అంతా సంసారం చేస్తానంటే శాస్త్రం ఒప్పుకోదు. ఇద్దరు కొడుకుల్ని కనేవరకే పర్మిషన్. ఒకవేళ ఆడపిల్లలే పుడితేనో! అప్పుడేం చెయ్యాలో ఎవరూ వివరించినట్టు లేదు.

ఈ కథంతా ఎందుకంటే, కొన్ని యుగాలనుండికూడా

పెళ్ళి తాలూకు అర్ధం, మగవాడి కిచ్చిన ప్రాముఖ్యం, ఆడ దాని పరిస్థితి తెలియడానికి. ఇప్పటికీ పెళ్ళి ఆడదానికి పిల్లల్ని కనడానికి లైసెన్సు మాత్రమే. ఈ లైసెన్సు లేని తల్లుల గురించి యింకోచోట మాట్లాడదాం.

ఇంతకీ పిల్లల్ని కనడం తప్పనీ, పెళ్ళి చేసుకోవడం పాప మనీ నేను అంటున్నాననుకొంటే అది పొరపాటే అవుతుంది.

పెళ్ళి, పిల్లలు అనేవి వ్యక్తిగత యిష్టాయిష్టాలు. పెళ్ళి లేని ఆడది పాపాత్మురాలనీ, పిల్లలులేని జీవితం వ్యర్థమనీ రూల్సు దేనికి?

ఎన్ని మంచి గుణాలున్న ఆడదానైనా సరే పెళ్ళి కాకపోతే అదేదో చెడిపోయిన దానికిందే చూసే స్టేజి మనం దాటలేమా? ఎంత ఛండాలం గుణాలున్నా సరే పెళ్ళి ముసుగులో కప్పడిపోతాయి. మనిషి గుణాలన్నీ రంగు రంగుల పూసలైతే పెళ్ళనేది వాటిని గుచ్చేదారం లాంటిది. బహుశా ఆ దారమే మంగళసూత్రమేమో! పెళ్ళనేది ఒక అద్భుతమూ కాదు, ఒక మహత్తర శక్తీ కాదు. పాపులు పవిత్రులైపోవ డానికీ, పవిత్రులు పరమ పవిత్రులైపోవడానికీను. పెళ్ళినాటికి వున్న గుణాలే పెళ్ళయ్యాకా వుంటాయి. మరి పెళ్ళికి యింత ఆధిక్యత ఎందుకిచ్చేరో తెలియదు. అదీ ఆడదానికే. మీసాలు పండిపోతున్నా మగాడి పెళ్ళికి తొందరపడని తల్లి దండ్రులు పైట వేసుకున్న మరుక్షణంనుంచి ఆడపిల్ల పెళ్ళికోసం గోలపెట్టేస్తారు.

అదేవంటే ఆడదాన్ని చిన్నతనంలో తండ్రి, వయసులో మొగుడు, ముసలితనంలో కొడుకు రక్షించాలని వేదాల్లో వుందన్నారు. ఆడదానికి మొగాడే రక్షకుడన్నారు. ఈ రక్షించేది ఎవర్నించి? మరో మొగాడినుంచి. ప్రతి ఆడది ఒక సీత. ప్రతి సీత చుట్టూ ఒక గీత. కట్టుకొయ్యకి కట్టిన పశువులా ఆ గీత లోపలే వుండాలి. ప్రతి సీత చుట్టూ గీతలు గియ్యక పోతే రావణాసురుడికే ఎందుకు గీతలుగియ్యకూడదుమొగాడు? లేకపోతే తనని తనే రక్షించుకొనే అవకాశం, శక్తి ఆడదానికే ఇస్తే, యింక ఆవిడని రక్షించే బరువు, బాధ్యతలు తనకీ తప్పుతాయి కదా. ఆడదానికి మొగాడు సెక్యూరిటీ అనుకుందాం. మరి ఈ రోజుల్లో ఉద్యోగం కూడా ఒక రకమైన సెక్యూరిటీనే. సెక్స్, పిల్లలు అక్కర్లేదనుకునేవాళ్ళు మొగుడి సెక్యూరిటీ కంటే ఉద్యోగవే నయం అనుకుంటే పెళ్ళి అవసరంలేదేమో. కాని అలాంటి వాళ్ళని మనం పవిత్రత పేరుతో బతకనిస్తామా?

పక్షికి పంజరం ఎలాంటిదో మనిషికి పెళ్ళి అలాంటిది. బయట హాయిగా, బుద్ధిగా తిరిగే పక్షినిచూసి మనకు అసూయ ఎందుకూ? సంతోషించక.

పెళ్ళనేది ఆడదానికిగాని, తద్వారా సంఘానికిగాని ఉద్ధరింపుకాదు. వయసుకీ, మనసుకీ ఆనకట్ట కట్టుకోగలిగితే పెళ్ళి అవసరం ఉండదేమో! పెళ్ళి, పిల్లలు అనేవి వ్యక్తిగత అవసరాలు, ఇష్టాయిష్టాలు. పోనీ యిన్ని బాధలుపడి పెళ్ళి

చేసుకుంటే అవెంతవరకు సక్సెస్ అవుతున్నాయి అంటే చెప్పడం కష్టం. చాలాభాగం ప్రేమలు పెళ్ళివరకు రాకుండానే పోతాయి. దానికి కారణాలు చాలా వున్నాయి.

అమ్మ, నాన్నకి ఎదురు చెప్పలేక పోవడం, లేకపోతే వాళ్ళు కుదిర్చిన సంబంధం తాలూకు డబ్బుకో, వాళ్ళిప్పిస్తా నన్న ఉద్యోగానికో, వాళ్ళు పంపిస్తానన్న అమెరికాకో ఆశ పడ్డంవల్ల చాలామంది అబ్బాయిలు "ఈ పెళ్ళి నా శరీరానికే కాని, నా మనసుకి కాదు. నా మనసులో నీ స్థానం ఎప్పుడూ వుంటుంది. నన్ను మర్చిపో" అని ఓ మూడు మణుగుల బరువైన డైలాగుతో మరో అమ్మాయితో చక్కా పోతారు. అంచేత అసలు ప్రేమ వివాహాలే తక్కువ.

మరైతే ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్లు విడిపోవటం లేదా? అనొచ్చు. విడిపోతారు కాని చాలా తక్కువ. వాటిని మనం ప్రేమ వివాహాలు అనే బదులు కామ వివాహాలు అనాల్సి వస్తుంది. వాళ్ళు కామాన్నే ప్రేమించుకొని, అది పోగానే వాళ్ళూ పోతారు.

చాలామందికి ప్రేమకీ కామానికీ సంబంధం తెలీదు. కామాన్ని ఆదరించి గౌరవిస్తేనే అది ప్రేమ అవుతుంది.

మరైతే అమ్మ, నాన్న కుదిర్చిన పెళ్ళిళ్ళు ఎంతవరకు సక్సెస్ అవుతున్నాయి అంటే చాలా తక్కువనే చెప్పొచ్చు. అంతవరకు ఒకరి మొహం ఒకరు ఎరగనివాళ్ళు అకస్మాత్తుగా కలిసి బతకవలసివచ్చి ఒకరితో ఒకరు ఎడ్జస్ట్ కాలేకపోవటం,

చాలాచోట్ల యిస్తానన్న డబ్బు యివ్వక డబ్బు పేచీలు, పెళ్ళికి ముందే ఇద్దరూ వేరెవర్నో ప్రేమించటంవల్ల అనుమానాలు వగైరాలవల్ల ఎక్కువ భాగం పైకి చెప్పకపోయినా సుఖంగా మాత్రం లేరు. కాకపోతే తెగించి విడిపోయే ధైర్యంలేక, పరువు, ప్రతిష్ఠలకి లొంగిపోయి కలిసి వుంటారు.

అంతమాత్రాన నేనేం తల్లిదండ్రుల్ని గౌరవించవద్దని అనడంలేదు. ఎవ్వరి కివ్వవలసిన గౌరవం, అభిమానం వాళ్ళ కివ్వాల్సిందే, అవి మన జీవితాలకి అడ్డురానంతవరకు.

ఇంతకీ నిజమైన పెళ్ళి క్కావల్సినవి - మంగళసూత్రం కట్టించుకున్నా మల్లెదండలు వేయించుకున్నా — పరస్పర ప్రేమానురాగాలు, ఒకరి తప్పులు ఒకరు ఎత్తి చూపించి సరి దిద్దుకోగల స్వేచ్ఛ, ఒకరి నొకరు అర్థం చేసుకోవడంగానీ, బాజాలు, డబ్బు, మంత్రాలు, మంగళసూత్రం, పురోహితుడు, రిజిస్ట్రారాఫీసు కాదు.

మొగుడు పెళ్ళాన్ని తనతో సమానంగాను, గౌరవం గాను చూడలేనినాడు వాళ్ళమధ్య సంబంధం కుక్కకీ, యజ మానికీ మధ్య సంబంధం మాత్రమే. కుక్కకి యజమాని అవ సరం ఎంతో, ఆడదానికి మొగుడి అవసరం కూడా అంతే. యజమాని లేనంత మాత్రాన కుక్కకి వచ్చే కష్టనష్టాలేం లేవు. యజమాని మాత్రం కుక్కని తన ఇంటికీ, ఆస్తికీ కాపలా కోసం, కొంత "షో" కోసం పెంచుతాడు. కొందరు కాపలాకి వేరుగాను కూడా మెయిన్‌టైన్ చేస్తారు.

పెళ్ళనేది తెలుగు సినిమాల్లో సుఖాంతమయ్యే చివరి సీనుగాని, చాలామంది నిజ జీవితాల్లో అది ట్రాజెడీగా అంతమయ్యే సెంట్రల్ థీమ్.

"మీ అబ్బాయి చదువైపోయింది కదా, ఏవైనా సంబంధాలు చూస్తున్నారా?" అన్నది తరచుగా వినిపిస్తుంది అక్కడికి చదువే పెళ్ళికి క్వాలిఫికేషన్లాగ. చదువున్నా, లేక పోయినా ఆడైనా, మగ అయినా ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తి స్వాతంత్ర్యము లేకపోతే పెళ్ళి చేసుకోవటం అనవసరం.

ఆడపిల్లని ముందు తల్లిదండ్రులు గుండెలమీద కుంపటిగానో, నెత్తిమీద స్టవ్‌గానో అనుకుంటూ భారంగా పెంచుతారు. మొగుడు కొడితే మాంధాతకాలం వాడూ కొట్టేడని, కని పించిన తల్లిదండ్రులకి బరువైన పిల్ల, ముక్కూ మొహం తెలీని మొగుడికి తేలికై పోతుంది. చిన్నతనంలో అందరికీ బరువై పోయి, కనీసం పెళ్లై స్వేచ్ఛా జీవితం ప్రారంభించవచ్చని కలలు కనే అమ్మాయికి అదీ ఒక కలగానే వుండిపోతుంది. ఇలా ఎడారి లాంటి జీవితంలో స్వేచ్ఛ అనే ఒయాసిస్సుకోసం జీవితాంతం వేటాడుతూనే వుంటుంది.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం ఎందుకింత ఆరాటం? అవంత ముఖ్యమా?

* * *

మనం పీల్చేగాలిలో "ఆక్సిజెన్" విస్తారంగా వున్నంత మాత్రాన సరిపోదు, ఆ గాలిని పీల్చుకొనే స్వేచ్ఛ మనకుండాలి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మనం పీల్చే ఊపిరిలో ప్రాణం లాంటివి. అవిలేని మనిషి శవంతో సమానం. శవం లేచి నడవా లంటే దానికి ప్రాణం అవసరం. భౌతికంగా ప్రాణానికి అర్థం ఏదైనా, నైతికంగా మాత్రం దాని అర్థం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు.

నువ్వు తింటున్నది దొండకాయ కూరో, దోసకాయ పచ్చడో తెలుసుకోవాలన్నా, పప్పు ఉప్పగా ఉందో చప్పగా ఉందో తెలుసుకోవాలన్నా నోట్లో నాలిక వున్నంతమాత్రాన సరిపోదు. ఆ నాలిక పొందిన అనుభూతిని, తెలుసుకున్న రుచిని ప్రకటించుకోగల స్వాతంత్ర్యం వుండాలి. ఆడదాని నాలికకి, నోటికి అవేలేవు. నోటి తాలూకు ధర్మమే మాట అయినప్పుడు (నోరు కేవలం తిండికే ఉందనుకోవడం నీచం) ఆ మాట్లాడలేని నోటికి అన్నం అందించడం అనవసరం. నిజానికది నైతిక నేరం కూడా.

ఎంచేతంటే అన్ని స్వేచ్ఛలూ వదలుకొని నిలుపుకో గలిగినంత గొప్పదికాదు ప్రాణం.

"ఏ బరువు, బాధ్యతలూ లేకుండా సుఖంగా మొగుడి నీడన బతక్కుండా స్వేచ్ఛో, స్వతంత్రమో అని ఏడుస్తారెం దుకూ?" అంటారు కొందరు.

అవును. మొదటినుండి ఆడది మొగాడి నీడలాగే బతుకు తోంది. మరి పురాణ యుగంలోకూడా గార్గి, మైత్రేయి (ఎప్పుడూ ఆ రెండే) లాంటివాళ్ళు తమంతట తామే పేరు

తెచ్చుకోలేదా అనొచ్చు, నీడ ఎప్పుడూ ఒక్కచోటే పడదు. కొన్ని సమయాల్లో మనిషికి ముందూ పడుతుంది. ముందు పడినంత మాత్రాన అది మనిషిని వెనక్కి త్రోసేసి తను ముందుకు పోలేదు. అదే మగాడి ధీమా. అవసరమనుకుంటే నీడను మళ్లా వెనక్కి నెట్టెయ్యగలడు. మరీ బరితెగిస్తే అసలా నీడనే మాయం చెయ్యగలడు. ఇలా యీ నీడ మగాడి వెనక యీ లోకంలోనే కాదు. పరలోకానికి కూడా వెళ్ళింది. దానినే అప్పటి మగవాడు ముద్దుగా "సతీ సహ గమనం" అని పిల్చుకున్నారు.

రేపు అనే మాటకి అర్థం తెలీని ఆడది యీ ఆత్మార్పణను ఆనందంగా స్వీకరించింది. ఈ ఆత్మార్పణే తన కష్టాలకి అంతం అనుకుంది. అందుకే 'అబల' అని చెరగని ముద్ర వేయించుకుంది. ఈమె అబలత్వమే తన బలం అనుకున్నాడు మగవాడు. అదే తన గొప్ప తనంగాను, మంచితనంగాను భావించేడు, చెప్పుకున్నాడు.

"పేద-గొప్ప" "మంచి-చెడు" ఈ రెంటికీ బలం వుంది.

బలం ఉన్నవాడే బుద్ధిమంతుడనుకోవడం పొరపాటు.

ఆడది 'అబల' అని మగవాడు ఎంత ఎత్తైగిరి అరిచినా, ఆమె చేజారిపోతుందేమోనన్న భయం అతనెప్పుడూ వెన్నాడుతూనే వుంది.అందుకే ఆమె ఆత్మార్పణని అలుసుగా తీసుకొని ఆమెని నైతికంగానూ, భౌతికంగానూ అగాధపు అడుగుల్లోకి త్రోసేసేడు. ఆవిడ అమాయకత్వాన్ని ఆధారంగా తీసుకొని

మతాంతికంగా ఆకాశానికెత్తేశాడు—"స్త్రీశక్తిస్వరూపిణి" "మాతృదేవత" వగైరా బిరుదులతో, మాతృదేవోభవ - తరవాతే పితృదేవోభవ అన్నాడు. సీతారాములు, రాధాకృష్ణులు అంటూ ఆడపేరు ముందుంచి మిమ్మల్ని ఎంత గౌరవిస్తున్నామో చూసుకోండి అన్నాడు.

దేవుణ్ణి కొట్టాలంటే, అతన్నే స్తుతించి, అతని దగ్గరుండే వరాలు పొంది అతన్ని అంతం చెయ్యాలన్న దానవ నీతిని అక్షరాలా పాటించేడు.

అయితే ఆత్మార్పణ చెయ్యగల ధైర్యంవున్న ఆడది 'అబల' ఎలా అవుతుంది?

నిజమైన బలం ఆడదాని ఆత్మార్పణలోనే వుందని గ్రహించినవాడు గాంధీజీ. ఈ ఆత్మార్పణతోనే సత్యాగ్రహం పేరుతో బ్రిటిషు వాళ్ళమీద ప్రయోగించేడు. అంతే! ధన్ మని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలొచ్చేయి. ఎవరికి? మగవాళ్ళకి.

ఎవరివల్ల? ఆడదానినుండి నేర్చుకున్న ఆత్మార్పణ సూత్రంవల్ల.

కాని మగవాడిది ఏనాడో మరిచిపోయేడు.

ఇదే ఆత్మార్పణని పాటించిన 'ఏసుక్రీస్తు'ని బహిరంగంగా మేకులుకొట్టి శిలువ కెక్కించేరు యూదులు. ఏమైనా మన మగవాడు బ్రిటీషు వాళ్ళంత అమాయకుడూ కాడు,

యూదులంత మూర్ఖుడూ కాడు. పోలీసుల్లా తెలివైనవాడు. అందుకే అడుగడుగునా కనిపించని లాఠీ దెబ్బలు తీస్తున్నాడు ఆడదానిమీద.

అసలు ఆడది మొదటినుండి అలుసుగాను, కంట్లో నలుసుగాను కనిపించింది మగవాడికి.

పురాణ యుగంలో ఆడదాన్ని గౌరవించేవారని తెగ మురిసిపోతాం మనం గత వైభవాన్ని తల్చుకుని, గౌరవించడం అంటే "ఏమండీ" అని పిలవడమే అయితే బహుశా అప్పుడు పెళ్ళాల్ని మన్నించేవారేమో తెలీదు కాని వాళ్ళకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మాత్రం లేవు. "అత్తగారూ మీరూ అంత రండు ముండ లేదండీ" అందిట వెనకటి కోడలు. ఆ గౌరవంకూడా యిలాంటిదే.

ఆనాడు ధర్మరాజు దర్జాగా జూదంలో తనను ఓడినప్పుడు "నా మీద నీకున్న అధికారం ఏమిటి?" అని అడగ్గలిగిందా ద్రౌపది? (పైగా ధర్మరాజు కేవలం అయిదోవంతు మొగుడు) ఐనప్పటికీ చెల్లదని తెలిసినా "నన్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా?" అంటూ "లా" పాయింటు లేపింది. అది అరణ్యరోదనమే అయింది.

స్వైరక్కుండా వరాలిచ్చేసి, అవి తీర్చడానికి వెళ్ళాల్సి అమ్మేసిన హరిశ్చంద్రుడ్ని ఏమని అడగ్గలిగింది? "నేనేం నీ కుర్చీనా? బెంచీనా అమ్మడానికి? నేనూ నీలాంటి మనిషినే

కదా?" అనెందుకు అడగలేదు. మొగాడ్ని వాడేం చేసినా ప్రశ్నించకూడదని, పాతివ్రత్య భంగం అని శాస్త్రం పేరుతో ఆమె నోరు కట్టేసేరు.

పురాణాలని తిట్టడం నా ఉద్దేశంకాదు, చెప్పదలచు కున్నది ఆనాటినుండి యీనాటివరకూ ఆడది మగాడికి ఒక ఆస్తిగా పనికొస్తోంది. ఆడదానికి రీసేల్ వాల్యూ కూడా వుంది. అవసరం ఉన్నన్నాళ్లూ వాడుకోవచ్చు లేదా తాకట్టు పెట్టుకో వచ్చు.

ఆడపిల్లల్ని అమ్మేసే తల్లిదండ్రులు, పెళ్ళాన్ని అద్దె కిచ్చే ప్రబుద్ధులు యీనాడూ వున్నారు.

మన ధర్మశాస్త్రాలన్నీ మనుధర్మశాస్త్రంమీద ఆధార పడి రాసినవి. పాపం, ఆ మనువు మహానుభావుడు ఒక్కటే మాట అన్నాడు "ఏ పరిస్థితుల్లోనూ ఆడదానికి స్వతంత్రం యివ్వకూడదు" అని. (నా అనుమానం అతనెప్పుడో జీవితంలో ఏదో ఆడదానిచేత కందుజెల్ల తిని వుంటాడని.)

ఆడదానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవు అని ఎన్ని సార్లనుకుంటే ఏం లాభం?

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనగానే హక్కులు, విధులు అనే మన మెదడులో మెదుల్తాయి. హక్కులు అనగానే తుపాకులు, విధులు అనగానే చీపురుకట్టలు అన్న భావం చాలా మందికి వుంది. హక్కులనేవి అధికారాలని, విధులనేవి సేవక

ధర్మాలని అనుకోవడం పొరపాటు. నిజానికీ రెండూ నాణేనికి రెండు పక్కలు లాంటివి.

స్వేచ్ఛ కావల్సింది రాజుక్కాదు, ప్రజలకి.

"అమ్మో! ఆడదానికి స్వాతంత్ర్యం యిస్తే ఇంకేమైనా వుందీ? బరితెగించదూ?" అని ముక్కుమీద వేలేసుకొని మరీ బాధపడతారు కొంతమంది మొగాళ్ళు.

స్వేచ్ఛ అనేది బాధ్యతల్ని పెంచుతుంది. బాధ్యతలు తెలిసిన వాళ్ళెవరూ చెడిపోరు. హక్కులేకుండా బాధ్యత బానిసలది. ఇది నీ ఇల్లు అనుకున్నప్పుడే కడిగి శుభ్రం చేస్తావు. పక్కింటిని నువ్వెందుకు బాగు చేస్తావు?

నీ పిల్లల్ని మోసి, కని, పెంచి పెద్ద చెయ్యాలి. ఇవన్నీ బాధ్యతలు. నిజమే, కాని వాళ్ళ మంచిచెడ్డలు నిర్ణయించే అధికారంకాని, హక్కుకాని తల్లికి లేవు. అలాంటి తల్లి పెంచిన పిల్లలు పొరులౌతారేమో కాని మంచి మాత్రంకారు.

పిల్ల తల్లి రూపురేఖలకేకాదు, గుణగణాలకి కూడా వారసురాలే అవుతుంది. తల్లికి లేని స్వేచ్ఛ, పిల్లలికి రావాలి, కావాలి అనుకోవడం బుద్ధి తక్కువ. చేసే పనిలో స్వేచ్ఛ ఉంటేనే చేసిన పనిలో నాణ్యత వుంటుంది.

ఆడదానికి స్వేచ్ఛ యిచ్చినంత మాత్రాన రోడ్ల మీద తిరిగి చెడిపోతుందా! నిజంగా అలా చెడిపోతే అది మగాడి తప్పుకాని ఆవిడదికాదు, మరలాంటప్పుడు ఆవిడ స్వేచ్ఛగా

తిరగ్గలిగేశక్తి అవకాశం కల్పించాల్సిన బాధ్యతకూడా మగ వాడిదే.

ఆడదానికి స్వతంత్రం యిచ్చినంత మాత్రాన తమ స్వతంత్రం తగ్గిపోతుందనుకోవడం భ్రమ. అవతలివాడి లేమి ఎప్పుడూ మన కలిమికాదు.

"వాళ్ళేం చేసినా చూసీ చూడనట్టు వూరుకుంటున్నాం కదా. ఇంకా స్వేచ్ఛ ఏమిటి?" అంటారు స్వేచ్ఛ కర్థం తెలీని వాళ్ళు. ఆడది కోరేది ముష్టికాదు, డిగ్నిటీ. ఆవిడకొకావల్సింది తన పేరు ఓటర్ల లెక్కల్లో వుండటంకాదు, ప్రణాళికల్లో వుండటం.

లోతుగా ఆలోచిస్తే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఒక రిచ్చేవి, మరొకరు పుచ్చుకునేవి కావు. ప్రతి ప్రాణికి సహజంగా వుంటాయి. ఒకవేళ మనల్ని మోసంచేసి ఎవరైనా అవి లాక్కున్నా మళ్ళీ మనమే సంపాదించుకోవాలి. అంతే!

అంచేత మగజాతిని మనం అడగాల్సింది మనకి వాళ్ళు లిమ్మని కాదు, మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకి అడ్డురావద్దని.

★